క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో 11 కేవీ లైన్ పనులు జరుగుతున్నందున శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజార్, మాన్యంచెల్క ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

అమర జవాన్లకు నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: పుల్వామాలో 2019లో జరిగిన దాడిలో అమరులైన జవాన్లకు చిట్యాల పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్, ఆక్స్‌ఫోర్డ్ స్కూల్‌లో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రీన్ గ్రోవ్ స్కూల్ డైరెక్టర్ జూలకంటి వేణుపాల్‌రెడ్డి, ఏఓ పోలా గోవర్ధన్, ఆక్స్‌ఫోర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ పెద్ది నరేందర్, ఉపాధ్యాయులు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నమ్ముల ఆనంద్‌కుమార్, పెద్ది పద్మ, షేక్ షమీం, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

తిప్పర్తి ఆర్ఐ బదిలీ

తిప్పర్తి : మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న బదిలీ అయ్యారు. మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి రెసిడెన్సి సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో అమర్యాదగా ప్రవర్తించడంతో సదరు వ్యక్తి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వద్ద తన గోడు వెల్లబుచ్చాడు. మంత్రి వెంటనే స్పందించి ఆర్‌ఐని బదిలీ చేయాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించడంతో బదిలీ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై తిప్పర్తి తహసీల్దార్ స్వప్నను వివరణ కోరగా.. ఆర్ సాధారణ బదిలీపై వెళ్లారని తెలిపారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను ఆదుకోవాలి

కనగల్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సమగ్ర శిక్షా ఉద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తిరందాసు సంతోష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మెదక్ జిల్లా చెగుంట మండలంలో సమగ్ర శిక్షా అభియాన్‌లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్న రమేష్ నాయక్, ఎర్రం శ్రీనివాసులు విధుల్లో భాగంగా ఎమ్మార్సీ చేగుంటకు వస్తుండగా మృతి చెందారని తెలిపారు. ప్రభుత్వం వారి అంత్యక్రియల ఖర్చులు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

నూతన కమిటీ నియామకం

చండూరు(గట్టుప్పల్) : ఎమ్మార్పీఎస్ గట్టుప్పల్ గ్రామ నూతన కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా మొద్దు గణేశ్, అధికార ప్రతినిధిగా ఖమ్మం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కామిరె శ్రీనివాస్, ఖమ్మం నరేష్, కోశాధికారిగా ఖమ్మం చంద్రయ్య, ప్రచార కార్యదర్శులుగా మొద్దు నవీన్, ఎర్ర కుమార్, సహాయ కార్యదర్శిగా కుర్మతి నర్సింహ, సంయుక్త కార్యదర్శిగా ఖమ్మం రాంబాబులను నియమించారు. కార్యక్రమంలో బరిగెల లింగయ్య, మండల కన్వీనర్ తలారి సాయిలు, కో కన్వీనర్ ఖమ్మం రాజశేఖర్, మొద్దు మల్లేష్, సుధాకర్, వడ్డేపల్లి సైదులు, దుబ్బాక మహేందర్, మొద్దు కుమార్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలలకు వితరణ



ఏపూరు పాఠశాలకు మైక్‌సెట్, ప్రింటర్ అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

చిట్యాల: మండలంలోని ఏపూరు జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల, వెలిమినేడు, గుండ్రాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లకు హైదరాబాద్‌కు చెందిన దాస్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మైక్ సెట్స్, ప్రింటర్స్ బహూకరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఖైజర్‌సబీహా, గరిషె అంజయ్య, వై.నర్సిరెడ్డి, ఏ.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

నార్కట్‌పల్లి : తన వరి పొలాన్ని నష్టం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మండలంలోని ఏపీ లింగోటం గ్రామ మాజీ సర్పంచ్ మేడి యాదయ్య పోలీసులను కోరారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు గ్రామంలోని సర్వే నంబర్ 355,ఊ లో ఒక ఎకరం ఆరు గుంటల వ్యవసాయ భూమి ఉందని, అందులో ప్రతి ఏడాది వరి సాగుచేస్తున్నానని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీన గుమ్మలబాయికి చెందిన దోనాల నాగార్జునరెడ్డి జేసీబీని తీసుకొచ్చి తన వరి పొలాన్ని పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. తాను పొలాన్ని విక్రయించకుండానే విక్రయించినట్లు సంతకాలను ఫోర్జరీ చేసి అక్రమంగా న్యాయస్థానం ద్వారా పట్టా చేసుకున్నాడని ఆరోపించారు.

ముందుకు సాగని రోడ్డు నిర్మాణం

- నిలిచిన పావురాలగూడెం–చౌళ్లగూడెం రోడ్డు పనులు
- 7 కిలోమీటర్ల రోడ్డుకు రూ.3.02 కోట్లు మంజూరు
- తప్పని ప్రయాణ కష్టాలు

శాలిగౌరారం: మండలంలోని పావురాలగూడెం–చౌళ్లగూడెం ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం 'ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు' అనే సామెతలా మారింది. అసంపూర్తిగా నిర్మించిన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

2023లో మంజూరు

శాలిగౌరారం మండల కేంద్రంలోని పావురాలగూడెం బస్టాప్ నుంచి మాధారంకలాన్ గ్రామపంచాయతీ పరిధిలోని చౌళ్లగూడెం 365వ నంబర్ జాతీయ రహదారి వరకు 7 కిలోమీటర్ల పొడవు ఉన్న ఆర్అండ్‌బీ సింగిల్ రోడ్డు అభివృద్ధికి 2023లో నాటి రాష్ట్ర ప్రభుత్వం నాన్‌ప్లాన్ నిధుల కింద రూ.3.02 కోట్లు మంజూరు చేసింది. 7 కిలోమీటర్ల రోడ్డులో కిలోమీటర్ సీసీ రోడ్డు, 6 కిలోమీటర్లు బీటీ రెన్యూవల్ పనులు చేపట్టవలసి ఉంది. రోడ్డు నిర్మాణానికి సంబంధించి అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్సియల్ అనుమతులు కూడా రావడంతో సూర్యాపేటకు చెందిన బీపీఎస్ కన్‌స్ట్రక్షన్స్ పనుల టెండర్ దక్కించుకుని నిర్మాణ పనులను చేపట్టింది. అందులో భాగంగా కిలోమీటర్ సీసీ రోడ్డు నిర్మాణంలో పావులరాలగూడెంలో 18 అడుగుల వెడల్పుతో 600 మీటర్ల పొడవు, ఊట్కూరు గ్రామంలో 12 అడుగుల వెడల్పుతో 400 మీటర్ల పొడవు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు.



ఊట్కూరులో బీటీ తొలగించడంతో కంకర తేలి అధ్వానంగా మారిన రోడ్డు

మొదలు కాని బీటీ రెన్యువల్ పనులు..

మండల కేంద్రంలోని పావురాలగూడెం బస్టాప్ నుంచి చౌళ్లగూడెం 365వ నంబర్ జాతీయ రహదారి వరకు 7 కిలోమీటర్ల పొడవు ఉన్న ఆర్అండ్‌బీ సింగిల్ రోడ్డులో కిలోమీటరు సీసీ రోడ్డు మినహా మిగిలిన ఆరు కిలోమీటర్ల బీటీ రెన్యూవల్ పనులు నేటికీ మొదలు పెట్టలేదు. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన అగ్రిమెంట్ గడువు దాటి సంవత్సరం కావొస్తోంది. కాగా ఊట్కూరు గ్రామంలో నూతన బీటీ రెన్యూవల్ కోసం ఉన్న బీటీ రోడ్డును సుమారు 500 మీటర్ల పొడవు తొలగించారు. దీంతో ఆ రోడ్డు పూర్తిగా కంకర తేలి ప్రమాదకరంగా మారింది. కాగా సుమారు రూ.80 లక్షల విలువ కలిగిన సీసీ రోడ్డు పూర్తయినా నాన్‌ప్లాన్ నిధులు కావడం, ప్రస్తుతం ఆ నిధులకు ప్రభుత్వం ఎల్‌ఓసీ జారీ చేయాల్సి ఉండడంతో ఆ ప్రక్రియ జరుగలేదు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపులు జరుగలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పావురాలగూడెం–చౌళ్లగూడెం రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. మండలంలోని మాధారంకలాన్, పెర్కకొండారం, ఇటుకులపహాడ్, వంగమర్తి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే ఈ రోడ్డు ఒక్కటే ప్రధాన మార్గం. అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి.

– మేడిపల్లి జలేందర్, మాధారంకలాన్

కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీచేశాం



పావురాలగూడెం–చౌళ్లగూడెం రోడ్డు అభివృద్ధి పనులు కాంట్రాక్టర్ జాప్యం వల్ల నిలిచిపోయాయి. ఇప్పటికే పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం రోడ్డు నిర్మాణదారుడికి నాలుగుమార్లు నోటీసులు కూడా జారీ చేశాం. నోటీసులకు జవాబు రాగానే తదుపరి చర్యలు చేపడుతాం.

– సంతోష్‌కుమార్ ఆర్అండ్‌బీ ఏఈ, శాలిగౌరారం

గురుకులాల్లో సౌకర్యాలు కల్పిస్తాం



నకిరేకల్ : విద్యార్థినులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి



శాలిగౌరారం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్ : ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకల పాఠశాల, కళాశాలను శుక్రవారం రాత్రి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి విద్య, భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో డ్రెయినేజీ సమస్య ఉందని, విద్యార్థులకు దుస్తులు ఉతుక్కునేందుకు వాష్ ఏరియా నిర్మించాలని కలెక్టర్‌ను ప్రిన్సిపల్ శోభారాణి కోరారు. అదేవిధంగా రెండు అదనపు తరగతి గదులు, లైబ్రరీ భవనం మంజూరు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. డ్రెయినేజీ, వాష్ ఏరియా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ బాలయ్యను ఆదేశించారు. అదనపు తరగతి గదులు, లైబ్రరీ భవనం మరో 3 నెలల్లో నిర్మించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్, స్థానిక తహసీల్దార్ జమురుద్దీన్ ఉన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

శాలిగౌరారం: ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల వసతి గృహంలోని సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లు, వంటగది, మూత్రశాలలను పరిశీలించారు. వసతి గృహంలో వంటగది, డ్రెయినేజీ ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని విద్యార్థినులు కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్.. తక్షణమే తన కోటా నిధుల ద్వారా పాఠశాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రిజిష్టర్లు, మందుల నిల్వల రికార్డులను పరిశీలించారు. తదుపరి స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వసతిగృహంలో సమస్యలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దారు యాదగిరి, ఎంపీఓ పద్మ ఉన్నారు.

పొదుపు పథకం వర్తింపజేయాలి

నల్లగొండ టౌన్: మగ్గం నేసే ప్రతి చేనేత కార్మికుడితోపాటు అనుబంధ వత్తి కార్మికులు మరో ఇద్దరికి చేనేత పొదుపు పథకం అమలు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత పొదుపు పథకంలో అనుబంధ కార్మికుల పొదుపు రూ.200 తగ్గిస్తూ రూ.600 పొదుపు చేసుకుంటే రూ.1200 ఖాతాలో జమ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. కార్మికులకు, సహకార సంఘాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ అమలు చేసి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. హౌస్ కం వర్క్ షెడ్ పథకం కింద చేనేత కార్మికులకు 120 గజాల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేశ్, ఉపాధ్యక్షులు కర్నాటి శ్రీరంగం, రాపోలు వెంకన్న, గడ్డం దశరథ, కర్నాటి వెంకటేశం, గోషిక నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీధర్

మద్యం పట్టివేత

మర్రిగూడ: మండలంలోని సరంపేట పరిధిలోని గర్షగడ్డలో శుక్రవారం బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న మోటం రాములమ్మ ఇంటిపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ అక్రమంగా రాములమ్మ ఇంట్లో నిల్వ చేసిన 8.7లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ వెంట సిబ్బంది యాదయ్య, రవి, హుస్సేన్, వాహిద్, సైదులు ఉన్నారు.

నిందితులను శిక్షించాలి

నల్లగొండ టౌన్ : తమిళనాడు రాష్ట్రం శివగంగా జిల్లాలో దళిత యువకుడి చేతులు నరికిన నిందితులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత యువకుడు అయ్యస్వామి బుల్లెట్ బైకు కొనుగోలు చేసి నడుపుతుంటే జీర్ణించుకోలేని అగ్రవర్ణ యువకులు ఆ యువకుడి రెండు చేతులను నరకడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. కుల వివక్షతలను రూపుమాపాల్సిన పాలకులే పెంచి పోషిస్తున్నారని విమర్శించారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న అఖిల పక్ష నాయకులు, గ్రామస్తులు

నార్కట్‌పల్లి : పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని అఖిలపక్ష నాయకుడు చిరుమర్తి యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిల పక్ష నాయకులు, గ్రామస్తులు, వ్యాపారస్తులు స్థానిక బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు ఏడాది నుంచి అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పట్టణ ప్రజలు, దుకాణదారులు దుమ్ము ధూళితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ధర్నాలో వివిధ పార్టీల నాయకులు చింతపల్లి బయన్న, మేడబోయిన శ్రీనివాస్, లింగాల యాదయ్య, కొరివి శంకర్, దోసపాటి విష్ణు, దుబ్బాక శ్రీధర్, కొప్పు శ్రవణ్, మల్లెబోయిన సైదులు, పాల్వాయి భాస్కర్‌రావు, కమ్మంపాటి రాములు, చెన్నరపు సత్తయ్య, మునుకుంట్ల గణేశ్, శ్రవణ్, వెంకట్, వడ్డేపల్లి నాగరాజు, రవి, రామలింగం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నల్లగొండ : నారాయణరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి



కేతేపల్లి : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ: పట్టణంలోని బోయవాడకు చెందిన ఇరిగేషన్ రిటైర్డు ఏఈ మామిడి నారాయణరెడ్డి మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య ఉన్నారు.

కట్టంగూర్ : మండలంలోని పామనగుండ్ల గ్రామానికి చెందిన కనుకుల జ్యోతి (నల్లగొండ మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్‌రెడ్డి చెల్లెలు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం పామనగుండ్లలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి జ్యోతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుంకర బోయిన నర్సింహయాదవ్, కట్టంగూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది సుక్కయ్యగౌడ్, పార్టీ జిల్లా కార్యదర్శి మాద లింగస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల ఊషయ్య, చెరుకు యాదగిరి, ముక్కాముల శేఖర్, వడ్డె భూపాల్‌రెడ్డి, చెవుగోని సాయిలు, రేకల శ్రీనివాస్, మండడి సత్తిరెడ్డి, ధర్మారెడ్డి, జాన్‌రెడ్డి, కొరివి యాదగిరి, బండారు కృష్ణ, ఆనంద్, ఎల్లయ్య ఉన్నారు.

కేతేపల్లి: ఇటీవల మృతి చెందిన డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు జటంగి వెంకటనర్సయ్యయాదవ్ తల్లి జటంగి లింగమ్మ సంతాప సభను శుక్రవారం కేతేపల్లిలో నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, దైదా రవీందర్‌లు వేర్వేరుగా పాల్గొని లింగమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ డైరెక్టర్లు బయ్య ముత్తయ్య, ఎస్‌కే.లతీఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, చామల శ్రీనివాస్, ఎ.మహేందర్‌రెడ్డి, ఎస్.మంగమ్మ, ఆర్.యాదగిరి, జటంగి సైదులు, చింతా ఆంధ్రయ్య, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు దుబ్బ జెల్లయ్య గురువారం మృతి చెందాడు. కాగా శుక్రవారం మండలంలోని బీజేపీ నాయకులు జెల్లయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం పార్టీ తరపున రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జెల్లయ్య అంత్యక్రియల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ పట్టణ సైదులు ఆరెల్ల సైదులు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

గ్రామ పంచాయతీ రికార్డుల పరిశీలన

నార్కట్‌పల్లి : గ్రామ పంచాయతీ పరిధిలో 100 శాతం పన్ను వసూలు చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని డీపీఓ వెంకయ్య గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు పన్ను వసూలు చేసిన వాటిని రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నార్కట్‌పల్లి కార్యదర్శి సుభానొద్దీన్, గీతాంజలి ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ

16న సగర శంఖారావం

చండూరు : తెలంగాణ రాష్ట్ర సగర సంఘం, నాగర్‌కర్నూల్ జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ గ్రౌండ్‌లో సగర శంఖారావం నిర్వహించనున్నట్లు సగర సంఘం జిల్లా అధ్యక్షుడు నెర్లకంటి రవికుమార్ తెలిపారు. శుక్రవారం చండూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి సగర కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని శంఖారావం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బలుగూరి కరుణాకర్ సాగర్, కల్లెట్ల పెద్ద మారయ్య, రామకృష్ణ, సుధాకర్ సాగర్, వెంకటేష్ పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

నల్లగొండ టౌన్: బ్యాంకు ఉద్యోగులకు 5 రోజుల పని దినాలు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఐడీబీఐ బ్యాంకు ఉద్యోగులు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులకు ఇచ్చే గ్రాట్యుటీ రూ.25 లక్షలు పెంచి దానిపై ఆదాయ పన్ను ఎత్తేయాలని కోరారు. కార్యక్రమంలో కత్తుల ఈశ్వర్‌కుమార్, సుమన్, శ్రామిక్, రాజేశ్వర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, యాదయ్య, రాజీవ్, రాజు, ప్రవీణ్, నరసింహ, రియాజ్ పాషా, వెంకట్‌రావు తదితదరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నకిరేకల్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఓగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యోగస్విని మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు నిత్యం ప్రజలతో మమేకమై ఉండడం వల్ల వ్యాధులబారిన పడకుండా ముందుస్తుగా వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమురుద్దీన్, విశ్వనాథుల నర్సిహాచారి, క్షయ నివారణ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

నకిరేకల్ : రంగారెడ్డి జిల్లా కోర్టులో జిల్లా న్యాయమూర్తి, న్యాయవాదులపై నిందితుడు జరిపిన దాడికి నిరసనగా నకిరేకల్‌లోని మున్సిఫ్ కోర్టులో శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, ప్రధాన కార్యదర్శి మంగ సైదులు, న్యాయవాదులు నర్సిరెడ్డి, పాపయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

మర్రిగూడ : మండలంలోని ఖుదాబాక్షపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన పందుల పాండుగౌడ్ శుక్రవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలో పది జీపీఏ సాధించే విద్యార్థులకు రూ.5 వేల నగదు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రామతులసి, ఉపాధ్యాయలు, కాంగ్రెస్ నాయకులు జంగయ్య, మహమ్మద్ జావెద్, గిరీష్, రాములు, జవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందుతోంది

మర్రిగూడ : గ్రామాల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందుతోందని క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ పి.రిషిక తెలిపారు. శుక్రవారం మండలంలోని శివన్నగూడలో వైఎస్ఆర్ పాఠశాల ట్యాంక్‌లతోపాటు ఇంటింటి నల్లాలను ఆమె పరిశీలించారు. పది రోజులుగా నిర్వహించిన నీటి వినియోగం సదస్సు సర్వేపై వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ప్రజలకు నిత్యం భగీరథ నీరు చేరాలని, ఏమైనా ఆటంకం ఏర్పడితే స్థానిక నీటినైనా సరఫరా చేయాలని మండల అధికారులకు సూచించారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, గ్రిడ్ ఏఈ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, నీటి సరఫరా సిబ్బంది ఉన్నారు.

సామూహిక జన్మదిన వేడుకలు

నకిరేకల్ : పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం రిటైర్డు ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఫిబ్రవరి మాసంలో జన్మించిన రిటైర్డు ఉద్యోగులకు ఆ సంఘం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాదిని లింగయ్య, లక్ష్మారెడ్డి, అంజయ్య, వంటల రామలింగయ్య, కందుల సోమయ్య, కందాల పాపిరెడ్డి, లింగయ్య, సూర్యకుమార్, పిచ్చయ్య, రాములు, సైమన్, భిక్షంరెడ్డి, రవీందర్, వెంకటనారాయణ, ఉత్తరమ్మ, జనార్దన్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

నకిరేకల్ : గ్రామీణ బ్యాంకుల సేవలు ప్రశంసనీయమని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య అన్నారు. నకిరేకల్‌లోని తిప్పర్తి రోడ్డులో గల గ్రామీణ బ్యాంక్‌లో శుక్రవారం వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులపై నిర్వహించిన అగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ సేవల వినియోగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రాము, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, ఉపేందర్, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ క్రాంతి కుమార్

నార్కట్‌పల్లి : రోడ్డు భద్రత నిబంధనలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ క్రాంతికుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకుగాను జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఏపీ లింగోటం గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేవారు హెల్మెంట్, సీట్ బెల్ట్ ధరించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదనిసూచించారు. కార్యక్రమంలో గడ్డం పశుపతి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలి'

మునుగోడు: ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని కోరుతూ మాల మహానాడు యువజన సంఘం నాయకులు శుక్రవారం మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పత్రులను దహనం చేశారు. కార్యక్రమంలో ముచ్చపోతుల శ్రీకాంత్, బెల్లపు బాలశివరాజు, బొల్లు సైదులు, పిట్టల శ్రవణ్, దాసరి సాయి, గోలి భాను, బెల్లపు ప్రసాద్, జీవణ్, లింగస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి సేవలో సివిల్ జడ్జి



పల్లకి సేవలో పాల్గొన్న సివిల్‌జడ్జి శ్రీదేవి దంపతులు

చిట్యాల, నార్కట్‌పల్లి : చిట్యాల పట్టణానికి చెందిన, రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పొన్న శ్రీదేవి, రామకిషన్ దంపతులు శుక్రవారం నార్కట్‌పల్లి మండలం గోపాలయపల్లిలో జరుగుతున్న శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో పూజలు చేశారు. పల్లకిసేవలో పాల్గొన్నారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చరణలో ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, అలయ అధికారి అంబటి నాగిరెడ్డి, గంజి వెంకటేశం, యేళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం జట్టుకు ప్రథమ బహుమతి

శాలిగౌరారం: మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నల్లగొండలో నిర్వహించిన డివిజన్ స్థాయి కబడ్డీ క్రీడా పోటీల్లో శాలిగౌరారం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఫైనల్‌లో నల్లగొండ రూరల్ జట్టుపై శాలిగౌరారం జట్టు విజయం సాధించి మొదటి బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో శాలిగౌరారం ఎస్ఐ ఎస్.సైదులు, పీడీలు మల్లేష్, జ్యోతి, అంజయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.